నమస్తే తెలంగాణ

మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | బుధవారం 20 నవంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD







1. రెండు వారాల క్రితం తవ్విన కాలువ

2. కాలువలో నింపిన మట్టి

- మార్కెట్ రోడ్‌లో డ్రైనేజీ కోసం తవ్విన కాలువను పూడ్చిన అధికారులు
- అసలేం జరుగుతుందని.. ఆశ్చర్యపోతున్న స్థానికులు

# ఎందుకు తవ్వారు.. పూడ్చారు..?

మంచిర్యాలటౌన్, నవంబర్ 19 : మంచిర్యాల పట్టణంలో చిత్రవిచిత్రమైన ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా మున్సిపల్ అధికారులు చేస్తున్న పనులు వారికి కూడా అర్థమవుతున్నాయో.. లేదోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే మార్కెట్ రోడ్‌లో ఆక్రమణల తొలగింపు, రోడ్డు వెడల్పు పేరిట భవనాలకు మార్కింగ్ ఇచ్చి కూల్చుతున్నారు. ఇదే సమయంలో ఎలాంటి టెండర్లు లేకుండానే డ్రైనేజీని నిర్మించాలన్న ఆలోచనతో అర్చన టెక్స్ చౌరస్తా నుంచి మార్కెట్ రోడ్ కింద వైపునకు 10 అడుగుల లోతు, ఐదడుగుల వెడల్పుతో కందకాన్ని తవ్వారు. ఆ మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించారు. జేసీబీని ఉపయోగించి చేసిన ఈ పనులకు ఎంత ఖర్చయిందో తెలియదు. అసలు పనులు ఎవరు చేస్తున్నారో కూడా తెలియదు. తవ్విన మట్టిని ఎక్కడికి తీసుకెళ్తున్నారో అర్థం కాని పరిస్థితి.. ఈ అంశాలే ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయంటే.. తవ్విన కందకాన్ని తిరిగి పూడ్చేశారు. సోమవారం రాత్రి లారీలతో మట్టిని తీసుకువచ్చి జేబీసీ సాయంతో కాలువను పూడ్చారు. ఇదంతా చూస్తున్న వ్యాపారులు, ప్రజలకు అసలేం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొన్నది. నిబంధనలు పాటించకుండా, టెండర్లు లేకుండా పనులు చేయడంపై ఇటీవల పలు పత్రికల్లో కథనాలు రాగా, ఉన్నతాధికారులు సీరియస్ అయినట్లు తెలుస్తున్నది. వారి మందలింపుల కారణంగానే ఈ పూడ్చివేతలకు దిగినట్లు పట్టణ వాసులు గుసగుసలాడుకుంటున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరేందుకు యత్నించగా ఆయన అందుబాటులో లేరు.





3. చిన్నిరాం వీధికి ఎదురుగా ఉన్న రోడ్డులో తవ్విన కాలువ

4. తవ్విన కాలువను మట్టితో నింపిన దృశ్యం

## మిథనాల్ ప్లాంట్‌ను వేగంగా పూర్తిచేయాలి



ఎస్టీపీపీని సందర్శించిన జీఎం కో ఆర్డినేషన్ సుభాని

జైపూర్, నవంబర్ 19: జైపూర్ సింగరేణి విద్యుత్ కేంద్రంలో ప్రయోగాత్మకంగా నిర్మిస్తున్న మిథనాల్ ప్లాంట్‌ను వేగంగా పూర్తి చేయాలని జీఎం కో ఆర్డినేషన్ సుభాని పేర్కొన్నారు. మంగళవారం ఎస్టీపీపీని సందర్శించిన జీఎం అధికారులతో కలిసి ప్లాంట్ నిర్మాణాన్ని పరిశీలించారు. సింగరేణి డైరెక్టర్ బలరాం ఆదేశాల మేరకు ప్రయోగాత్మకంగా నిర్మిస్తున్న ప్లాంట్ పనులను డిసెంబర్ 31లోగా పూర్తి చేయాలని సూచించారు. పనుల తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈడీ రాజశేఖర్, జీఎం పీసీఎస్ శ్రీనివాసులు, ఏజీఎం ఈఅండ్ఎం మదన్ మోహన్, డీజీఎం సివిల్ అజిలుల్లాఖాన్, మేనేజర్ ఫారెస్టు చంద్రమణి, ఎస్‌వోటూ ఈడీ ప్రభాకర్ పాల్గొన్నారు.



# ఏజెన్సీలో భయం భయం

## అటవీ సమీపంలోని పల్లెల్లో సంచరిస్తున్న పులి

- నిత్యం ఎక్కడో చోట పశువులపై దాడి
- ప్రస్తుతం కెరమెరి అడవుల్లోకి ప్రవేశించినట్లు సమాచారం
- కంటి మీద కునుకులేకుండా చేస్తున్న టైగర్
- పల్లె ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ) : కొద్ది రోజుల క్రితం మహారాష్ట్ర నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోకి ప్రవేశించిన పులి అటవీ సమీప గ్రామాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. నిత్యం ఎక్కడోచోట పశువులపై దాడులు చేస్తుండగా, భయం భయంగా గడపాల్సిన పరిస్థితి నెలకొంది. సాధారణంగా యేటా అక్టోబర్ నుంచి జనవరి మాసాల్లో తోడు కోసం జిల్లాలోకి వచ్చే పులులు ప్రాణహిత బార్డర్ సమీపంలోనే సంచరించేవి. కానీ.. ఈ యేడాది ఇందుకు భిన్నంగా జిల్లాలోకి ప్రవేశిస్తూ ఏజెన్సీ ప్రాంతంలోని అడవుల్లో తిరగడం విశేషం. దాదాపు నాలుగు నెలలుగా కెరమెరి, జైనూర్, ఊట్నూర్, నార్నూర్ మండలాల్లోని అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్న పులి పశువులపై దాడి చేస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నది. అయితే.. ఈ ప్రాంతాల్లో సంచరిస్తున్న పులి ఒక్కటేనా.. లేక అంతకన్న ఎక్కువగా ఉన్నాయా అనేది.. అధికారులు నిర్ధారించలేకపోతున్నారు. గత ఆగస్టులో కెరమెరి మండల పరిధిలో పులి అడుగులను గుర్తించిన అటవీ అధికారులు.. ఆపై మహారాష్ట్రలోకి వెళ్లిందని భావించారు. కానీ.. రెండు నెలలుగా మళ్లీ పులి సంచారం ఎక్కువైంది. ప్రాణహితను దాటుకొని కాగజ్‌నగర్ మీదుగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి సమీపం నుంచి కెరమెరి అడవుల్లోకి ప్రవేశించినట్లు తెలుస్తున్నది. ఆపై కెరమెరి, తిర్యాణి మండలాల అటవీ పాంతంలో సంచరించి అటు నుంచి కవ్వాల్ అడవుల్లోకి వెళ్లి ఉంటుందని భావించారు. తిరిగి ఇటీవల కెరమెరి అడవుల్లోకి వచ్చినట్లుగా ఆనవాళ్లున్నాయి. వారం క్రితం ఉట్నూర్‌లోని ఎక్స్ రోడ్, చాందూరి, నార్నూర్, రాజుల్‌గూడ ప్రాంతాల్లో పులి సంచారం కనిపించింది. పశువులపై దాడి చేసిన ఘటనలు ఉన్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. తాజాగా.. రెండు రోజుల నుంచి కెరమెరి అటవీ ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు నిర్ధారించారు. జోడేఘాట్ అడవులతో పాటు తిర్యాణి అటవీ ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు గుర్తించారు.

### దప్పు చాటింపులతో అవగాహన

కెరమెరి మండలంలో పులి సంచారం ఉండడంతో పోలీసులు, అటవీ అధికారులు డప్పు చాటింపులతో అవగాహన కల్పిస్తున్నారు. మంగళవారం కెరమెరి మండలం టోకెన్ మోవాడ్, బాబెఝురితో పాటు చుట్టుపక్క గ్రామాల్లో పులి సంచారం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఒంటరిగా బయటకు రావద్దని, పశువులను అడవుల్లోకి తోలుకెళ్లవద్దని హెచ్చరించారు. పులికి ఎలాంటి హాని కలిగించవద్దని, పులి వలన ఎవరికీ ఎలాంటి నష్టం జరిగినా అటవీ శాఖ నుంచి నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. పులి కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని అధికారులు కోరుతున్నారు.



పులి సంచారంపై బాబేఝురిలో అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

## పరిశుభ్రతతో వ్యాధులు దూరం

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

హాజీపూర్, నవంబర్ 19 : పరిశుభ్రతతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం హాజీపూర్ తాహసీల్దార్ కార్యాలయంలో మరుగుదొడ్ల జాతీయ దినోత్సవం నిర్వహించగా, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, తహసీల్దార్ శ్రీనివాస్ రావ్ దేశ్ పాండేతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటికీ మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. కర్నమామిడి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ అందుతుందన్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే సమయంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. కలెక్టర్ వెంట మండల పరిషత్ అధికారి ప్రసాద్ ఉన్నారు.

### మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

లక్షెట్టిపేట, నవంబర్ 19 : మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం గుల్లకోట గ్రామంలో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన పెరటి కోళ్ల యూనిట్‌ను అధికారులతో కలిసి సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళల కోసం క్యాంటీన్లతో పాటు మీ సేవ కేంద్రాలు, డైరీ, కోళ్ల ఫారంలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం గుల్లకోట, బలరావుపేట, జెండావెంకటాపూర్ గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే తదితరులు ఉన్నారు.

## మద్యం తాగి విధులకు

- మంచిర్యాల మున్సిపల్ ఉద్యోగుల నిర్వాకం

మంచిర్యాలటౌన్, నవంబర్ 19 : బార్‌లో మద్యం సేవించి విధులకు హాజరైన మంచిర్యాల మున్సిపల్ ఉద్యోగుల వ్యవహారం ఆలస్యంగా బయటకు వచ్చింది. డ్యూటీలో ఉండగా వారు మద్యం సేవిస్తున్నట్లు కనిపించే వీడియో, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాగా, ఈ విషయం కమిషనర్‌కు తెలియగా, ఆయన సదరు ఉద్యోగులను మందలించినట్లు ప్రచారం జరుగుతోంది. మంచిర్యాల మున్సిపాలిటీలో శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు దర్జాగా బార్‌లో మద్యం సేవించడాన్ని గమనించిన పలువురు వారి వీడియోను చిత్రీకరించారు. అనంతరం వారు మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహించడాన్ని గమనించారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి పలువురు తీసుకువెళ్లగా.. కేవలం మందలించి వదిలేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# యాసంగి సాగు 1,24,292 ఎకరాలు

- గూడెం ఎత్తి పోతల కింద పెరగనున్న వరిసాగు..
- ఈ ఏడాది 1.05 లక్షల ఎకరాలు
- 27 వేల క్వింటాళ్ల విత్తనాలు.. 39,663 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం
- అంచనా వేసిన వ్యవసాయాధికారులు
- చేతికొచ్చిన వానకాలం పంట

దండేపల్లి, నవంబర్ 19 : జిల్లాలో వానకాలం పంట దాదాపు చేతికిరాగా, రైతాంగం అప్పుడే యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్నది. ఈ క్రమంలో సాగు విస్తీర్ణాన్ని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. జిల్లాలో 1,24,292 ఎకరాల్లో పంట సాగవనున్నదని ప్రణాళికలు సిద్ధం చేసింది. బావులున్న ప్రాంతాల్లో రైతులు నారుమళ్లు సిద్ధం చేసుకుంటున్నారు. సమృద్ధిగా వర్షాలు కురవడంతో జలాశయాలు, వాగులు, కుంటల్లోకి పుష్కలంగా నీరు చేరింది. ఇందుకు అనుగుణంగా సాగు విస్తీర్ణం, అవసరమయ్యే విత్తనాలు, ఎరువుల వినియోగంపై జిల్లా వ్యవసాయాధికారులు ప్రణాళికలు రూపొందించారు. 1,24,292 ఎకరాల్లో సాగు అంచనా వేయగా, ఇందులో 1.05 లక్షల ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశమున్నదని తెలిపారు. దీంతో పాటు వివిధ పంటలకు 27 వేల క్వింటాళ్ల విత్తనాలు, అలాగే 39,663 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని అంచనా వేశారు.

### గూడెం ఎత్తిపోతల కింద పెరగనున్న వరి సాగు..

ఎల్లంపెల్లి జలాశయంలో సమృద్ధిగా నీరు ఉండడంతో గూడెం ఎత్తిపోతల ద్వారా యాసంగికి నీరు అందించనున్నారు. కడెం 30వ డిస్ట్రిబ్యూటరీ కాలువ నుంచి చివరి వరకు 30 వేల ఎకరాలు సాగవుతున్నది. నీరు పుష్కలంగా ఉండడంతో సాగు మరింత పెరిగే అవకాశాలున్నాయి కాలువలకు దూరంగా ఉన్న పొలాల్లో మక్క, వేరుశనగ సాగు చేయనున్నారు. కడెం జలాశయం నుంచి జన్నారం మండలంతో పాటు, దండేపల్లి మండలంలోని 28 కాల్వ వరకు నీటిని అందించనున్నారు.



దండేపల్లి మండలం తాళ్లపేటలో కోతకు సిద్ధంగా వరి

### చేతికొచ్చిన వరిధాన్యం..

జిల్లాలో ముందుగా నాట్లు వేసిన చోట వరి కోతలు పూర్తయి, పంట చేతికొచ్చింది. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించి, తూకం వేసుకొని విక్రయించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఆలస్యంగా సాగైన చోట పంట కోతలు నడుస్తుండగా, మరి కొన్ని చోట్ల వారం, పది రోజుల్లో కోతలు ఊపందుకోనున్నాయి. పనులన్నీ పూర్తవగానే బావులు, నీటి వనరులు ఉన్న రైతులు యాసంగి పనులు ప్రారంభించనున్నారు.



తానిమడుగు వద్ద 30వ డిస్ట్రిబ్యూటరీ కాలువ

**ఎరువుల వినియోగం అంచనా (మెట్రిక్ టన్నుల్లో)**

| ఎరువులు | వినియోగం |
|---|---|
| యూరియా | 14,645 |
| డీఏపీ | 5,966 |
| కాంప్లెక్స్ | 11,563 |
| ఎంవోపీ | 4,436 |
| జింక్ సల్ఫేట్ | 1,030 |
| ఎస్ఎస్‌పీ | 2,023 |

**పంట సాగు అంచనా**

| పంట | విస్తీర్ణం (ఎకరాల్లో) |
|---|---|
| వరి | 1,05,735 |
| మక్క | 3,709 |
| శనగ | 1,238 |
| ఇతర | 13,007 |
| జొన్న | 244 |
| పెసర | 214 |
| మినుములు | 145 |



ఫర్టిలైజర్ దుకాణాలకు వచ్చిన ఎరువులు

## వాహనాలను పకడ్బందీగా తనిఖీ చేయాలి


- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



చెక్ పోస్టును ఆకస్మిక తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

వాంకిడి,నవంబర్ 19 : రాష్ట్ర సరిహద్దు వద్ద వాహనాల తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అధికారులను ఆదేశించారు. మంగళవారం వాంకిడి మండల కేంద్రం సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్రంలో సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ ఇస్తున్న నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా వాహనాలను తనిఖీ చేయాలని సూచించారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బంది విడుతల వారీగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా నుంచి వెళ్లే పత్తి వాహనాలను సైతం తనిఖీ చేసి అనుమతులు లేకుంటే సరిహద్దు దాటకుండా నియంత్రించాలని తహసీల్దార్ రియాజ్ అలీ, ఎస్ఐ ప్రశాంత్‌ను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలను డీటీడీవో రమాదేవితో కలసి పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, ఆర్ఐ మాజిత్ ఉన్నారు.

## రెగ్యులరైజ్ చేయకుంటే సమ్మె చేస్తాం



ఏడీ గమానియల్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్19 : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తమ సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేయకుంటే సమ్మెకు దిగుతామని సమగ్ర శిక్ష ఉద్యోగులు హెచ్చరించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా విద్యా శాఖ డైరెక్టర్ గమానియల్, కలెక్టర్ కార్యాలయ ఏవోలకు వేర్వేరుగా సమ్మె నోటీసులు అందజేశారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తమను రెగ్యులరైజ్ చేస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. పక్షం రోజుల్లో స్పందించకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కొప్పుల మోహన్, కోశాధికారి బోయిని నగేశ్, కార్యదర్శి దుర్గం సందీప్, సీసీవో జిల్లా అధ్యక్షుడు అనూప్, ఎంఐఎస్ జిల్లా కోశాధికారి రాజ్‌కుమార్, సీఆర్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్, ఐఈఆర్పీ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, నాయకులు మల్లేశ్, అంబరావ్ పాల్గొన్నారు.

## వేలాలలో వైభవంగా గిరి ప్రదక్షిణ



వేలాల గట్టుమల్లన్నకు పూజలు చేస్తున్న భక్తులు

జైపూర్, నవంబర్ 19 : మండలంలోని వేలాల గట్టు మల్లన్నస్వామి సన్నిధిలో మంగళవారం గిరిప్రదక్షిణను వైభవంగా ప్రారంభించారు. చిలుకూరి దేవాలయం అర్చకులు సురేష్ ఆత్మరాం, చిలుకూరి దేవాలయం వారి సహకారంతో వేలాల ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, జైపూర్ తహశీల్దార్ వనజారెడ్డి, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ పాల్గొని మొక్కుకున్నారు. కార్తీకమాసం మంగళవారం సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని వేలాల గట్టు మల్లన్నకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రతినెలా ఆరుద్ర నక్షత్రం నాడు గిరి ప్రదక్షిణ ఉంటుందని, భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ఈవో రమేశ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వేలాల ఆయల కమిటీ సభ్యులు, సుమారు 800 మంది భక్తులు పాల్గొన్నారు.



గిరిప్రదక్షిణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్లు, తహశీల్దార్ వనజారెడ్డి